దోమల మోత.. డెంగీ వాత

- నియోజకవర్గంలో తీవ్రమైన సమస్య
- ప్రచారానికే పరిమితమైన పరిశుభ్రత
- విజృంభిస్తున్న డెంగీ



పిఠాపురం పట్టణంలో స్వైరవిహారం చేస్తున్న వరాహాలు

పిఠాపురం: గతంలో దోమలపై అధికారులు దండయాత్ర చేస్తే, ఇప్పుడు దోమలు డెంగీ యాత్ర చేస్తున్నాయి. దోమల మోతతో పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు కంటిపై కునుకు పట్టడం లేదు. ప్రజల ఆరోగ్యంతో దోమలు చెలగాట మాడుతున్నాయి. దోమల విజృంభణతో డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛ భారత్ ప్రచారానికే పరిమితమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పట్టణం, గ్రామాలనే తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం పేరుకుపోవడంతో, దుర్వాసన వెదజల్లుతూ దోమల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతోంది. దీంతో ఎక్కడ చూసినా దోమల బాధ ఎక్కువైంది. రాత్రి సమయాల్లో దోమల బాద విపరీతంగా ఉంటుందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. దోమల నివారణకు వినియోగించాల్సిన ఫాగింగ్ యంత్రాలు మూలన పడిపోవడం, కొత్త యంత్రాలు కొనుగోలు చేసినా వాటిని ఉపయోగించిన దాఖలాలు లేకపోవడం, గ్రామాల్లో డ్రైన్లు మురికికూపాలుగా మారిపోవడం వంటి సమస్యలతో దోమల నివారణ మున్సిపాలిటీ, పంచాయతీలకు సాధ్యం కావడం లేదు. ఎంతో ఆర్భాటంగా నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో స్వచ్ఛ భారత్ పేరుతో ప్రదర్శనలు నిర్వహించడం మినహా, ఎవరూ ఎటువంటి దోమల నివారణా చర్యలు తీసుకోకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు.

ప్రతి రోజూ టన్నుల కొద్దీ చెత్త పేరుకుపోతుంది. దీనిని తొలగించడానికి చర్యలు సక్రమంగా తీసుకోకపోవడంతో చాలా చోట్ల చెత్త పేరుకుని, డ్రైనేజీలు నిండిపోయి, దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. దీంతో ఎక్కడ చూసినా దోమల ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. దోమల బారి నుంచి కాపాడుకోవడానికి ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాయంత్రమైతే చాలు ఎక్కడ చూసినా దోమల గోలే వినిపిస్తుందని స్థానికులు వాపోతున్నారు.

పెరుగుతున్న అంటువ్యాధులు

నియోజకవర్గంలో పిఠాపురం పట్టణంతో పాటు, పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి తదితర మండలాల్లో పారిశుధ్య లోపంతో అంటు వ్యాధులు విజృంభిస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా డ్రైన్లు పొంగిపొర్లుతుండడంతో పాటు, ఎక్కడ చూసినా పందులు, చెత్త పేరుకుపోవడంతో దోమలు పెరిగి అంటు వ్యాధులు విజృంభిస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు.

క్లుప్తంగా

తిరగటికి జాతీయ పురస్కారం



తిరగటి విజయరత్నం

సామర్లకోట: విజయవాడ శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయ పురస్కారానికి పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు తిరగటి విజయరత్నం ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయన వివరాలు తెలిపారు. ఈ నెల 21వ తేదీన విజయవాడలోని కొత్తాపూర్ణానంద విలాస్ కళావేదికలో పురస్కారం అందుకోవడానికి ఆహ్వానం వచ్చిందన్నారు. తెలుగు భాష, సంస్కృతి, సాహిత్యం, తెలుగు కళల పరిరక్షణ కోసం విజయరత్నం నిరంతరం కృషి చేస్తున్నారు. ఆయన తెలుగు భాషపై చేస్తున్న కృషికి ఫలితంగా ఈ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ప్రస్తుతం విజయరత్నం తామరాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కొత్తపల్లి: ఉప్పాడ ఫీడర్‌పై మరమ్మతులు, హార్బర్‌కు బోట్లను తరలించడానికి మండలంలోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం డివిజన్ ఈఈ ఏవీఎస్ఎస్ ప్రభాకరావు శుక్రవారం తెలిపారు. దీంతో సూరాడపేట, పాత మాయపట్నం, అమీనాబాద్ గ్రామాలకు సాయంత్రం నాలుగు నుంచి 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని చెప్పారు.

ఫుడ్ ప్రోసెసింగ్ సొసైటీలో డీఆర్‌పీలకు దరఖాస్తులు

సామర్లకోట: కాకినాడ జిల్లాలోని మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లో జిల్లా రీసోర్సు పర్సన్లు, మండల రీసోర్సు పర్సన్‌లను నియమించనున్నట్టు డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు డిగ్రీ అర్హత కలిగి, 21 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు వారై ఉండాలని, కంప్యూటర్, ఇంటర్ నెట్ రంగంలో ప్రావీణ్యం కలిగి ఉండాలని, ప్రయాణంపై ఆసక్తి కలిగి, సొంత స్మార్ట్‌ఫోన్ ఉండాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈ నెల 20వ తేదీ లోపుగా ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు.పేర్లు నమోదు చేయించుకున్న వారికి ఈ నెల 24న సామర్లకోట టీటీడీసీలో రాత పరీక్ష ఉంటుందన్నారు. ఎంపిక అయిన వారికి రూ.20వేల గౌరవ వేతనం ఇస్తారని తెలిపారు. ఇతర వివరాకు 89198 68419 లేదా 90309 24569 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కాశీ విశ్వేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న కాశీవిశ్వేశ్వరస్వామి

సామర్లకోట: పట్టణంలోని స్థానిక గాంధీచౌక్‌లో ఉన్న కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘమాసాన్ని పురస్కరించుకుని ఆలయ ధర్మకర్త చుండ్రు బలరామ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

21న త్యాగరాజ ఆరాధనోత్సవం

సామర్లకోట: త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా ఈ నెల 21న పట్టణంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నాయీబ్రాహ్మణ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు, 14వ వార్డు కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావు తెలిపారు. స్థానిక సంగీతరావుపేట నుంచి త్యాగరాజ చిత్రపటంతో పట్టణంలో ఊరేగింపు నిర్వహిస్తారన్నారు. అనంతరం స్థానిక బళ్ల మార్కెట్‌లో ఉన్న కనకమహాలక్ష్మి కల్యాణ మంటపంలో సంగీత కచేరి జరుగుతుందని తెలిపారు. కళాకారులు, సాహిత్యాభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట: పట్టణంలోని సత్యనారాయణపురంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు విన్నకోట సురేష్ శుక్రవారం తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఉచితంగా బీపీ, సుగర్ పరీక్షలు చేస్తారని చెప్పారు. ఉదయం 6.30 నుంచి ప్రారంభించే ఈ శిబిరానికి ఎటువంటి ఆహారం తీసుకోకుండా రావాలన్నారు. వివరాలకు 98664 11346 నంబరుకు సంప్రదించాలన్నారు.

శ్రీకృష్ణదేవరాయలు జయంతి

కాకినాడ రూరల్: అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో శ్రీకృష్ణదేవరాయలు 554వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణరాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ప్రసాద్ నాయుడు తదితరులు శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన గొప్ప రాజనీతిజ్ఞుడని కొనియాడారు.

అపర్ణాదేవిని దర్శించుకున్న దర్శకుడు పరశురాం



అపర్ణాదేవిని దర్శించుకుంటున్న పరశురాం దంపతులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి అమ్మవారి ఆలయాన్ని ప్రముఖ సినీ దర్శకుడు పి.పరశురాం దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకుడు ఆకుండి వెంకటేశ్వర శర్మ ఆలయ విశిష్టతను తెలిపారు. అపర్ణ అమ్మవారి సహస్రనామ కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని ఆలయ ప్రధానార్చకుడు ఆకొండి ప్రభాకర శాస్త్రి నిర్వహించారు. అనంతరం వారికి పూజా కుంకుమ, అమ్మవారి ప్రసాదం, అమ్మవారి శేష వస్త్రాలు, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. సర్కారు వారి పాట, గీతగోవిందం, ఫ్యామిలీ స్టార్ వంటి సినిమాలను దర్శకుడు పరశురాం దర్శకత్వం వహించారు.

జగనన్న లేవుట్‌ను పరిశీలించిన కలెక్టర్



కొమరగిరి లేఅవుట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరిలో ఉన్న జగనన్న లేఅవుట్‌ను శుక్రవారం కలెక్టర్ షణ్మోహన్ పరిశీలించారు. ఇక్కడ కాకినాడ అర్బన్‌కు కేటాయించిన ఇళ్ల స్థలాలకు మార్గం కల్పించే ఏర్పాట్లపై ఖాళీగా ఉన్న స్థలాన్ని సందర్శించారు. గతంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలకు సంబంధించిన లేఅవుట్‌ను కలెక్టర్ పరిశీలించారు. దారి ఏర్పాటుపై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఆర్డీవో మల్లిబాబు, కొత్తపల్లి తహసీల్దార్ చిన్నారావు తదితరులు ఉన్నారు.

పూర్తి అవగాహనతో రీ సర్వే చేయాలి



శిక్షణలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీరమణి



శిక్షణకు హాజరైన వివిధ శాఖల అధికారులు

సామర్లకోట: భూముల రీ సర్వేను పూర్తి అవగాహన చేయాలని పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. పెద్దాపురం డివిజన్ పరిధిలోని 13 మండలాలకు చెందిన రెవెన్యూ, సర్వే అధికారులకు శుక్రవారం స్థానిక సాంకేతిక శిక్షణాభివృద్ధి కేంద్రంలో ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి రైతు భూమి హద్దులు, వాటి కొలతలు, విస్తీర్ణం, పటం, భౌగోళిక గుర్తులు, భూమి తరం తెలియజేయాల్సి ఉంటుందన్నారు. వీటితో పాటు భూమిపై శిస్తు సేకరించి, చట్టపరంగా భద్రపర్చుకోవడమే భూమి రీ సర్వే లక్ష్యమని చెప్పారు. భూమికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భూములు, దేవదాయ శాఖ భూములు, దాతలు ఇచ్చిన భూములు ఉంటాయని తెలిపారు. భూమి వివాదాలు లేకుండా రీ సర్వే దోహదపడుతుందని చెప్పారు. సర్వే చేసిన రికార్డుల ఆధారంగా, భూమి కలిగిన వారికి సరైన చట్టపర న్యాయం, రక్షణ కల్పించడానికి అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా పంట వివరాలను ప్రభుత్వం తెలుసుకోవడానికి దోహదపడుతుందని చెప్పారు. సర్వే డిపార్టుమెంట్ ఈ పనులు పూర్తి చేసి, తగు రికార్డులు తయారు చేసి రెవెన్యూ శాఖకు అందజేయాల్సి ఉంటుందన్నారు. సర్వే పూర్తయ్యాక రైతులకు పట్టాదారు పాస్ పుస్తకం ఇస్తారని తెలిపారు. ఈ పుస్తకంలో సర్వే చేసిన భూమి వివరాలు నమోదు చేసే ముందు రైతుల నుంచి అభ్యంతరాలు సేకరించాలన్నారు. ఎటువంటి అభ్యంతరాలు లేని సమయంలోనే పట్టాదారు పాస్ పుస్తకం ఇచ్చి, రైతు సంతకం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. జిల్లా సర్వే అధికారి కె.శ్రీనివాసు, డీఐఓలు శివప్రసాద్, అంబికాలమ్మ, రవిశంకర్ శిక్షణ నిర్వహించారు. డివిజన్ పరిధిలో తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

కాలువలో కొనసాగుతున్న గాలింపు



సామర్లకోట లాకుల వద్ద కాలువలోని గుర్రపు డెక్కలో గాలిస్తున్న ఎస్సై రమేష్‌బాబు, సిబ్బంది

సామర్లకోట: కాలువలో దూకిన విలేకరి షేక్ సలీమ్(36) కోసం శుక్రవారం పోలీసులు గాలింపు కొనసాగిస్తున్నారు. పెదపూడిలో లోకల్ పేపర్ విలేకరిగా పని చేస్తున్న సలీమ్ ఈ నెల 9న రాత్రి స్థానిక రైల్వే గేటు ఎదురుగా ఉన్న నూతన వంతెన పైనుంచి గోదావరి కాలువలో దూకిన విషయం విదితమే. అప్పటి నుంచి అతడి బంధువులు, స్నేహితులతో పాటు, పోలీసులు గోదావరి కాలువ, పిఠాపురం బ్రాంచి కాలువల్లో గాలింపు చేస్తున్నారు. శుక్రవారం ఎస్సై రమేష్‌బాబు ఆధ్వర్యంలో గాలింపు కొనసాగింది. సాయంత్రం వరకూ సలీమ్ ఆచూకీ లభించలేదని పోలీసులు తెలిపారు. గోదావరి కాలువలో గుర్రపు డెక్క పెరిగిపోవడం వలన, ఒకవేళ సలీమ్ మృతి చెందితే అతడి మృతదేహం గుర్రపు డెక్కలో చిక్కుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. గుర్రపు డెక్క తొలగించడానికి ఇరిగేషన్ అధికారులతో చర్చిస్తామని సీఐ కృష్ణభగవాన్ తెలిపారు. సలీమ్ చనిపోయి ఉంటే మృతదేహం గోదావరి కాలువ గుర్రపు డెక్కలో చిక్కుకున్నా, దుర్వాసన వస్తుందనే వాదనలు వినిపిస్తున్నాయి. గోదావరి కాలువ వెంబడి ఎటువంటి దుర్వాసన రాకపోవడం, మృతదేహం దొరక్కపోవడంతో, కాలువలో దూకిన వ్యక్తి ఈత కొడుతూ బయటపడి ఉండవచ్చనే అనుమానాలు బలపడుతున్నాయి.

జ్యోతిబసు మార్గం అందరికీ ఆదర్శప్రాయం

వర్ధంతి సభలో సీపీఎం నేతల నివాళులు



జ్యోతిబసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెద్దాపురం: స్వాతంత్ర్య సమరయోధుడు, సీపీఎం వ్యవస్థాపక పొలిట్‌బ్యూరో సభ్యుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు మార్గం అందరికీ ఆదర్శప్రాయమని సీపీఎం నాయకులు సిరిపురపు శ్రీనివాస్ అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో శుక్రవారం జ్యోతిబసు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు పార్టీ మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ అధ్యక్షత వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ, 24 ఏళ్ల పాటు సీఎంగా కొనసాగి, 30 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత జ్యోతిబసుకే దక్కుతుందన్నారు. ప్రధాన మంత్రి అయ్యే అవకాశం వచ్చినా, పార్టీ నిర్ణయానికి కట్టుబడిన గొప్ప వ్యక్తి జ్యోతిబసు అని కొనియాడారు. పశ్చిమ బెంగాల్ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, పంచాయతీ చట్టాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపారన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.సత్యనారాయణ, డి.కృష్ణ, చల్లా విశ్వనాథం, రొంగల వీర్రాజు, కూనిరెడ్డి అరుణ తదితరులు పాల్గొన్నారు.

మామిడి పూతకు మంచు కోత



అంతంతమాత్రంగా ఉన్న మామిడి పూత

పిఠాపురం: మామిడి సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో ఆ చెట్లన్నీ పూతతో కళకళలాడుతున్నాయి. కొన్ని రోజులుగా విపరీతంగా కురుస్తున్న మంచు మామిడి పూతపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మంచుతో మామిడి పూత మాడి, రాలిపోతోంది. ఒకవైపు ఉద్యాన శాఖాధికారులు సూచనలు చేస్తుండగా, రైతులు మందులు పిచికారీ చేస్తున్నా మామిడి పూతపై మంచు ప్రభావం మాత్రం ఆగడం లేదు. ఈ పరిస్థితి మామిడి దిగుబడిపై ప్రభావం ఉండవచ్చని రైతులు అంటున్నారు.

క్రీడలతో పాటు విద్యకు ప్రాధాన్యమివ్వాలి



విజేత నాగులాపల్లి జట్టుకు జ్ఞాపికను అందిస్తున్న అతిథులు

కొత్తపల్లి: క్రీడాకారులు క్రీడలతో పాటు విద్యకు ప్రాధాన్యమివ్వాలని సీడీసీడీసీ-2 చైర్మన్ అనిశెట్టి సత్యానందరెడ్డి, వీవీఎస్ విద్యా సంస్థల కరస్పాండెంట్ అనిశెట్టి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని నాగులాపల్లిలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగుతున్న ఏఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంటు శుక్రవారంతో ముగిసింది. విజేతగా నాగులాపల్లి జట్టు నిలిచింది. విజేతలకు మాజీ ఎమ్మెల్యే దివంగత అనిశెట్టి బుల్లబ్బాయిరెడ్డి జ్ఞాపకార్థం రూ.12 వేలు, జ్ఞాపికను అందజేశారు. ద్వితీయ బహుమతిగా కొమరగిరి జట్టు నిలిచింది. వీరికి బిళ్లకుర్తి సురేంద్రరెడ్డి రూ.9 వేలు, జ్ఞాపికను అందించారు. ఈ టోర్నమెంటులో 40 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పీహెచ్‌సీలను తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ



కొమరగిరి ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరి, నాగులాపల్లి పీహెచ్‌సీలను జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) నరసింహ నాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు, ఓపీ వార్డులు, లేబర్ రూమ్‌లు, ఫార్మసీ స్టోర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట వైద్యాధికారులు రాజ్‌కుమార్, సౌజన్య, వైద్య సిబ్బంది ఉన్నారు.

20న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ: కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయంలో ఈ నెల 20వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస పీడీ కె. లచ్చారావు తెలిపారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలైన మహీంద్రా ట్రాక్టర్స్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్, సూపర్‌వైజర్, మెకానిక్, హెల్పర్, హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్, కస్టమర్ రిలేషన్ షిప్ మేనేజర్, ముత్తూట్ ఫైనాన్స్ ట్రైనీ అసోసియేట్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐసాన్ ఎక్స్‌పీరియన్సెస్ కంపెనీలో టెలిసేల్స్ ఎగ్జిక్యూటివ్, ఇండో ఎంఐఎం, హోండాయ్ మోబీస్, పానాసోనిక్ అండ్ ఇసుజు మోటార్స్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారన్నారు. డీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నట్లు తెలిపారు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో హాజరుకావచ్చన్నారు.

స్వచ్ఛ దివస్‌లో పాల్గొననున్న కలెక్టర్

సామర్లకోట: రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న స్వచ్ఛ భారత్‌లో భాగంగా శనివారం పి.వేమవరం గ్రామంలో జరిగే స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో కలెక్టర్ షణ్మోహన్ ముఖ్యఅతిథిగా హాజరవుతారు. ఈ మేరకు ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛ దివస్ నిర్వహిస్తారని ఎంపీడీఓ చెప్పారు. అలాగే శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య ఒక ప్రకటనలో తెలిపారు. మఠంసెంటర్‌లో మానవహారం, స్వచ్ఛ ప్రతిజ్ఞ ఉంటాయని తెలిపారు. కౌన్సిలర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు హాజరు కావాలన్నారు.

20 నుంచి లెప్రసీ డిటెక్షన్ క్యాంపెయిన్



లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపెయిన్‌పై పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: జిల్లాలో లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2 వరకు సర్వే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో లెప్రసీ కేసు డిటెక్షన్, మేనరికపు వివాహాలపై జిల్లా వైద్యారోగ్య శాఖ కరపత్రం, వాల్‌పోస్టర్‌ను డీఎంహెచ్ఓ జె.నరసింహనాయక్, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ ఆర్ రమేష్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ వైఎస్ చక్రధర్, డిప్యూటీ డెమో అధికారి కె.సూర్యచంద్రరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సర్వేలో ప్రతి గృహాన్ని సందర్శిస్తారని, అనుమానాస్పద మచ్చలు ఉంటే నిర్ధారణ కోసం పరీక్షిస్తారన్నారు. సంబంధిత పీహెచ్‌సీ వైద్యుడు, పరీక్షించి, కేసును నిర్ధారణ చేస్తారని వివరించారు. ఆశా, ఏఎన్ఎంలు యాప్‌ల ద్వారా అనుమానాస్పద కేసులను మెడికల్ ఆఫీసర్ హెల్త్ లాగిన్‌లో సమర్పిస్తారన్నారు. తద్వారా కేసును గుర్తించి, ఉచితంగా మందులు ఇస్తారన్నారు. 2027 నాటికి లెప్రసీ అనేది లేకుండా చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్టు కలెక్టర్ వివరించారు.

నేడు స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం న్యూ ఇయర్-క్లీన్ స్టార్ట్ అనే ప్రత్యేక అంశంతో జిల్లాలో ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్ నుంచి జేసీ రాహుల్ మీనా, మున్సిపల్ కమిషనర్ భావనతో కలిసి కలెక్టర్ అన్ని మండలాల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వచ్ఛ కాకినాడ జిల్లా రూపొందించడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించడం, ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించడం తదితర లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చెత్తకుప్పల తొలగింపు, మురికి కాలువల ప్రక్షాళన, ప్రజా మరుగుదొడ్లు శుభ్రం చేయడం, ప్రధాన రహదారులు, కూడళ్లను శుభ్రం చేయడం ఇతర పారిశుధ్య కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, ర్యాలీలు, ప్రతిజ్ఞలు చేయించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.